సాక్షి
మెదక్
శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



సింగరాయకు రారండి

కోహెడ మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది.

వివరాలు 8లో ▸



కళాకారుల నిలయం

జీహెచ్ఈఎల్ కాలనీలోని కమ్యూనిటీ సెంటర్ కళాకారులకు నిలయంగా మారింది.

వివరాలు 8లో ▸



న్యూస్‌రీల్

కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందండి



మాట్లాడుతున్న లీగల్ సెల్ సభ్యుడు

హవేళిఘణాపూర్(మెదక్): ప్రజల హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందాలని జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ చైర్మన్ లక్ష్మీశారద అన్నారు. మండల పరిధిలోని తొగిటలో గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పౌరుల హక్కులకు భంగం కలిగించడం, నేరం, మోసాలు జరిగితే వినియోగదారుల ఫోరంను సంప్రదించాలని సూచించారు. చిన్న చిన్న తగాదాలకు కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయం వృథా అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు విజయ్, ప్రమీల, భరోసా మెంబర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నర్సాపూర్: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం జాతీయ విపత్తు నిర్వహణ రెస్పాన్స్ ఫోర్స్ ఆధ్వర్యంలో గిరిజన గురుకుల పాఠశాల, కాలేజీలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతి విపత్తులు తలెత్తినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి, జాతీయ విపత్తుల నిర్వహణ రెస్పాన్స్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మన్‌మోహన్ యాదవ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫైజల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



గౌడ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల అభివృద్ధికి పాటు పడుతున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత అన్నారు. గురువారం మండలంలోని దండుపల్లిలో గౌడ సంఘం భవన నిర్మాణం కోసం జెడ్పీ నిధుల నుంచి మొదటి విడతగా రూ. 3.19 లక్షలు కేటాయించామని తెలిపారు. అనంతరం ఎలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఎంపీటీసీ లత, ఆత్మ కమిటీ డైరక్టర్ భిక్షపతి, మాజీ ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సుధాకర్, గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం తీరు సరికాదు: సీపీఎం



ధర్నాలో సీపీఎం నాయకులు

మెదక్ కలెక్టరేట్: కేరళ వామపక్ష ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. గురువారం ఢిల్లీలో కేరళ వామపక్ష ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నాకు సంఘీభావంగా మెదక్ పోస్టాఫీస్ వద్ద ఏర్పాటు చేసిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని రాష్ట్ర విపక్ష ప్రభుత్వాలపై వివక్ష చూపుతుందన్నారు. రాష్ట్రాలకు రావాల్సిన గ్రాంట్లు నిలిపివేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌కు 65 మంది గైర్హాజరు

మెదక్ కలెక్టరేట్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు గురువారం 65 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో ఉదయం, సాయంత్రం జరిగిన పరీక్షలకు మొత్తం 1,132 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 867 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఇంటర్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ పరిశీలించారు.

మాఘస్నానాలకు ముస్తాబు

ఏడుపాయలలో ఏర్పాట్లు పూర్తి

పాపన్నపేట(మెదక్): పవిత్ర మాఘస్నానాలకు ఏడుపాయల ముస్తాబైంది. వనదుర్గా భవాని మాత సన్నిధి మంజీర నదిలో శుక్రవారం వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేశారు. మాఘ అమావాస్య సందర్భంగా మంజీర నదిలో స్నానం చేస్తే పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. మహారాష్ట్రలోని బాలాఘాట్ కొండల నుంచి సుమారు 700 కిలోమీటర్ల మేర మంజీరా నది ప్రవహిస్తూ మార్గమధ్యలో అడవులు, చెట్లు చేమలను దాటుకుంటూ రావడం మూలంగా ఎన్నో వన మూలికలు నీటిలో కలుస్తాయని... అనారోగ్య సమస్యలు ఉన్నా దూరం అవుతాయని భక్తుల్లో ప్రబలి ఉన్న నమ్మకం.

50 వేల మంది వస్తారని అంచనా

అయితే మాఘస్నానాల కోసం ఏడుపాయలకు సుమారు 50 వేల మంది భక్తులు హాజరవుతారని పాలకవర్గం అంచనా వేస్తుంది. ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. ఏడుపాయల ఆలయం, చెక్‌డ్యాం, ఘనపూర్ ఆనకట్ట ప్రాంతాల్లో భక్తులు స్నానాలు చేయడానికి షవర్ల ఏర్పాటుతో పాటు మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ఏర్పాటు చేశారు. ఆలయం ఎదుట క్యూలైన్లు, రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో రానుండడంతో పార్కింగ్ కోసం చర్యలు చేపట్టారు. నాగసాన్‌పల్లి వైపు నుంచి వచ్చే వారి కోసం చెల్మెలకుంట వద్ద.. పోతాన్‌శెట్టిపల్లి వైపు నుంచి వచ్చే భక్తుల కోసం రెండో బ్రిడ్జి వైపు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది పోలీసులతో బందోబస్తు చర్యలు చేపట్టారు. ఇక భక్తుల స్నానాలకు అవసరమయ్యే నీటి కోసం ఇటీవల సింగూర్ నుంచి ఘనపురం ఆనకట్టకు నీటిని వదిలారు.



స్నానాల కోసం ఏర్పాటు చేసిన షవర్లు

'గృహజ్యోతి' వెలుగులు

200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు కసరత్తు

- క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది
- ఈనెల 15 వరకు లబ్ధిదారుల గుర్తింపు



మెదక్: ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేసే దిశగా సర్కారు ముందుకు సాగుతోంది. ఇందులో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ (గృహజ్యోతి) పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. ఈనెల 15వ తేదీ వరకు లబ్ధిదారుల వివరాలు సేకరించాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైనా ఆదేశాలు రావడంతో సిబ్బంది ఇంటింటి సర్వేను ముమ్మరం చేశారు. ఇప్పటికే ప్రజాపాలనలో భాగంగా ఐదు పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు ఒకే దరఖాస్తు ఫారం అందించారు. అందులో గృహజ్యోతికి సంబంధించిన కాలంలో ఆధార్‌కార్డుతో పాటు మీటర్, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్ వివరాలను లబ్ధిదారులు పొందుపర్చారు. ఇందులో అర్హులను గుర్తించేందుకు ట్రాన్స్‌కో సిబ్బంది సర్వే ప్రారంభించింది.

కేటగిరీ–1లో 1,76,314 మంది

జిల్లాలో కేటగిరీ–1 కింద గృహ విద్యుత్ వినియోగదారులు మొత్తం 1,76,314 మంది ఉన్నారు. ప్రతి నెలా మాదిరిగానే బిల్లింగ్ చేస్తూ వినియోగదారుల వివరాలను సిబ్బంది సేకరిస్తున్నారు. రేషన్ కార్డు ప్రమాణికం కావడంతో బిల్లింగ్ మిషన్‌లో అదనంగా లబ్ధిదారుడి వివరాలు నమోదు చేసేందుకు ఇటీవల ఆప్షన్ ఇచ్చారు. అందులో ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్, మీటర్ నంబర్ వివరాలు నమోదు చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ వరకు లబ్ధిదారుల వివరాలను బిల్లింగ్ మిషన్‌లో పొందుపర్చాలని స్పష్టమైనా ఆదేశాలు రావడంతో సర్వేను ముమ్మరం చేశారు. బిల్లింగ్ సిబ్బంది, లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఆర్టిజన్లు ఇంటింటికీ తిరుగుతున్నారు. అద్దెకు ఉంటున్న వారి వివరాలు సైతం సేకరిస్తున్నారు.

80 శాతం అర్హులు

జిల్లావ్యాప్తంగా 1,76,314 సర్వీస్ నంబర్లు ఉండగా ఇందులో 80 శాతం మంది నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుతున్నారని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. కాగా ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కొనసాగుతుండగా ఇక నుంచి వారికి సైతం గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు వినియోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.



చిన్నశంకరంపేట మండల కేంద్రంలో లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సాహం

కలెక్టర్ రాజర్షిషా

వెల్దుర్తి(తూప్రాన్): వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పాం సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని హకింపేట, ఉప్పులింగాపూర్‌లో ఆయిల్‌పాం సాగును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఐదు వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు లక్ష్యం కాగా ఇప్పటివరకు సుమారు ఆరు వందల ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తి చేశామన్నారు. అదేవిధంగా పంట సాగుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సిలిండర్ కోసం 1.57 లక్షల దరఖాస్తులు

ఆరు గ్యారంటీల కోసం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కంప్యూటరైజ్డ్ చేశామని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. వంటగ్యాస్ సిలిండర్ స్కీం కోసం ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని అచ్చంపేట, ఉప్పులింగాపూర్‌లో కొనసాగుతున్న వెరిఫికేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. పలు సాంకేతిక సమస్యలు వస్తున్నాయని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకురాగా టెక్నికల్ టీంతో ఫోన్‌లో సంప్రదించి సమస్యను నివృత్తి చేశారు. జిల్లాలో రూ.500కు గ్యాస్ సిలిండర్ కోసం 1.57 లక్షల దరఖాస్తులు రాగా సుమారు 87 వేలు సక్రమంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య, డీపీఓ గోవింద్, అధికారులు పాల్గొన్నారు.



ఆయిల్ పాం మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ రాజర్షిషా

తప్పులను సరి చేయండి

మెదక్ కలెక్టరేట్: ప్రజాపాలన దరఖాస్తుల్లో గ్యాస్ కనెక్షన్ల వివరాల్లో చాలా తప్పులు ఉన్నాయని, వాటిని సరిచేసి వెంటనే సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని సర్వే బృందాలను కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. తప్పిదాలను సరిచేసేందుకు ఏర్పాటు చేసిన గ్రామ, మున్సిపల్ వార్డు స్థాయి బృందాలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ఈనెల 10 లోగా వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వే బృందాలు తమను సంప్రదించలేదని ఇతర దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

ఓటరు జాబితా విడుదల

రెండు నియోజకవర్గాల్లో 4,42,891 మంది ఓటర్లు



మెదక్ కలెక్టరేట్: జిల్లా పరిధిలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 4,42,891 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. వీరిలో 9 మంది ఎన్ఆర్ఐలు, 126 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. అలాగే 2,13,460 మంది పురుష ఓటర్లు ఉండగా 2,29,431 మంది మహిళా ఓటర్లు 11 మంది థర్డ్ జెండర్స్ ఉన్నారని తెలిపారు. 9 మంది ఎన్ఆర్ఐ ఓటర్లలో 8 మంది పురుషులు, 1 మహిళా ఓటరు ఉన్నట్లు చెప్పారు. అలాగే 126 మంది సర్వీస్ ఓటర్లలో పురుషులు 121, మహిళా ఓటర్లు 5 మంది ఉన్నారని వివరించారు. జనవరి 22 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది ఓటరు జాబితాను రూపొందించామని స్పష్టం చేశారు. జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవెల్ అధికారుల వద్ద, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించే తహసీల్దార్, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

ఈసారైనా నిధులొచ్చేనా?



మెదక్: మెదక్ అభివృద్ధికి ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారా అని జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మెదక్ పట్టణాభివృద్ధికి రూ.50 కోట్లు, ఏడుపాయలకు రూ.100 కోట్లు, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీల అభివృద్ధికి రూ. 25 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. అయినప్పటికీ ఇందుకు సంబంధించి నిధులు మంజూరు కాలేదు. కాగా జిల్లా అభివృద్ధి చెందాలంటే ఈ బడ్జెట్‌లో నిధులు విడుదల కావాల్సి ఉంది. అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు మెదక్ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ట్రాఫిక్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రింగ్‌రోడ్డు నిర్మిస్తే ఈ ఇబ్బందులు తప్పుతాయని ప్రజలు పేర్కొంటున్నారు. అంతేకాకుండా భారీ వాహనాలు వస్తే పట్టణంలో ట్రాఫిక్ జాం ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూతన జిల్లాల ఏర్పాటు సందర్భంగా కొత్తగా ఆరు మండలాలు ఏర్పాటు చేశారు. వీటి కార్యాలయాలు అద్దె, అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. ఈ బడ్జెట్‌లో నిధులు మంజూరైతే సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నారు.

మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్: మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా ఆమె సాక్షి తో మాట్లాడారు. జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి తీసి చార్మినార్ జోన్‌లో కలపాలని అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కాగా నియోజకవర్గంలో విద్య, వైద్యంతో పాటు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతానని పేర్కొన్నారు. ప్రధానంగా నర్సాపూర్‌లో ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కాలేజీ భవనానికి, నియోజకవర్గంలోని పలు గురుకులాలకు సొంత భవనాలు నిర్మించేందుకు.. నర్సాపూర్ లో స్టేడియం నిర్మాణంతో పాటు మంజీరాపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయా లని అడుగుతానని ఆమె వెల్లడించారు.

పిల్లలను బడికి పంపించాలి

డీఈఓ రాధాకిషన్

కొల్చారం(నర్సాపూర్): పిల్లలు పాఠశాలలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని డీఈఓ రాధాకిషన్ సూచించారు. గురువారం మండలంలోని ఎనగండ్ల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట పదో తరగతి విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులతో కలిసి వెళ్లారు. పాఠశాలకు రాకపోవడంపై ఆరా తీసి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రేపటి నుంచి పాఠశాలకు పంపుతామని తల్లిదండ్రులు చెప్పారు. తనిఖీల్లో భాగంగా పదో తరగతి విద్యార్థుల సాధన, ప్రాక్టీస్ టెస్టులను పరిశీలించారు. మంచి ఫలితాలు సాధించేందుకు అవసరమైన సూచనలు, సలహాలను ఉపాధ్యాయులకు అందజేశారు. ఆయన వెంట ఏఎంఓ సుదర్శన మూర్తి, సీఎంఓ సతీష్, పాఠశాల హెచ్ఎం వెంకట రమణ చార్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ

రేడియేషన్ థెరపీలో నూతన సాంకేతికత

అభివృద్ధికి ఐఐటీహెచ్ శ్రీకారం



హైదరాబాద్ ఐఐటీ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: క్యాన్సర్ రోగులకు అందించే రేడియో థెరపీ చికిత్సలో నూతన సాంకేతికత అభివృద్ధి కోసం ఫరీదాబాద్ అమృత ఆస్పత్రి, ఎరంకి ల్యాబ్స్ సంస్థలు హైదరాబాద్ ఐఐటీతో ఒప్పందం చేసుకున్నాయి. క్యాన్సర్ కణితి కదలిక, రేడియేషన్ హైపర్ థెర్మియా కోసం స్వదేశీ సాంకేతికతతో కూడిన రోబోటిక్స్ అల్ట్రాసౌండ్ సాంకేతికతను అభివృద్ధి చేసే ప్రాజెక్టుపై ఆయా సంస్థలు హైదరాబాద్ ఐఐటీతో ఒప్పందం చేసుకున్నాయి. ఐఐటీహెచ్‌లోని బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగం, ఈ సంస్థలతో కలిసి ఈ సాంకేతికను అభివృద్ధి చేయనుంది. ఈ సందర్భంగా అమృతా హాస్పిటల్ రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ భాస్కర్‌విశ్వనాథన్ మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు అందించే ఇమేజి గైడెడ్ థెరపీల కోసం రోబోట్ సహాయక అల్ట్రాసౌండ్ సిస్టమ్ సాంకేతికతను దేశీయంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని అన్నారు. ఈ అత్యాధునిక సాంకేతికత క్యాన్సర్ గాయాలను కచ్చితత్వాన్ని గుర్తిస్తుందని అన్నారు. చికిత్స సమయంలో దాని కదలికను పర్యవేక్షించడం ద్వారా హైపోథెర్మియా డెలివరీకి మార్గనిర్దేశం చేయడంతో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

పరీక్షకు ఏర్పాట్లు చేయండి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం ఈనెల 11వ తేదీన జరిగే కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ రమేశ్ అధికారులను ఆదేశించారు. గురువారం గురుకుల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 6 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈకేంద్రాల్లో 2,540 మంది పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులు సకాలంలో హాజరై పరీక్ష రాయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, గురుకుల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై కొరడా

అల్లాదుర్గం(మెదక్): అక్రమంగా మైనింగ్ చేపడుతున్న క్రషర్ నిర్వాహకులపై పోలీసులు, రెవెన్యూ అధికారులు కేసు నమోదు చేసిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, తహసీల్దార్ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో రెండున్నర ఎకరాలకు మైనింగ్ కోసం అనుమతి పొంది ఐదు ఎకరాల వరకు మైనింగ్ చేపట్టడంతో కలెక్టర్ అదేశాల మేరకు విచారణ చేపట్టి మైనింగ్‌ను రద్దు చేసినట్లు చెప్పారు. అక్రమంగా మైనింగ్ చేపడుతున్న క్రషర్ నిర్వాహకులపై తహసీల్దార్ అదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



ముస్లాపూర్ శివారులోని క్రషర్

రూ. 3.74 కోట్ల దుర్వినియోగం: ఆర్ఐ అరెస్ట్

తూప్రాన్: పౌర సరఫరాల గోడౌన్‌లో ఆర్ఐగా విధులు నిర్వర్తించిన చింతల నగేశ్‌ను అరెస్ట్ చేశారు. రూ. 3.74 కోట్ల అక్రమాలకు పాల్పడిన కేసులో సివిల్ సప్లై డిస్టిక్ మేనేజర్ హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ కృష్ణ గురువారం పేర్కొన్నారు. తూప్రాన్ పౌర సరఫరా గోడౌన్‌లో 2019 నుంచి 2024 వరకు ఆర్ఐగా నగేశ్ విధులు నిర్వర్తించారు. ఈ క్రమంలోనే పీడీఎఫ్ బియ్యం, చక్కెర, గన్నీ బ్యాగుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆశాఖ అధికారులు గుర్తించారు. కాగా గతేడాది తూప్రాన్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పని చేసినప్పుడు రైతు బతికుండగానే చనిపోయాడని తప్పుడు ధృవీకరణ పత్రం సృష్టించి జైలుకు వెళ్లి వచ్చాడు. అలాగే ఆస్తుల జప్తు కోసం ఆశాఖ ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేశారు.

క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న రాములునాయక్, తదితరులు

నారాయణఖేడ్: రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో పాల్గొనాలని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ఎమ్మెల్యే బాలునాయక్‌లు గురువారం శాసనసభ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 14 నుంచి 17 వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు రాములు నాయక్ పేర్కొన్నారు.

ప్రతిభకు లింగ భేదం లేదు



మాట్లాడుతున్న ఉపాసన

పటాన్‌చెరు: ప్రతిభకు లింగ భేదం లేదని అపోలో ఆస్పత్రుల సామాజిక సేవ (సీఎస్ఆర్) ఉపాధ్యక్షురాలు ఉపాసన కామినేని అన్నారు. గీతం విశ్వవిద్యాలయం ప్రతియేటా మూడు రోజుల పాటు నిర్వహించే సాంకేతిక, సాంస్కృతిక (టెక్నో, కల్చరల్ ఫెస్ట్)పండుగను గురువారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆడ, మగ అనే లింగ భేదం లేకుండా, విశేషమైన విజయాల కోసం కృషి చేయాలన్నారు. ప్రారంభోత్సవంలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న విశాఖ ఇండస్ట్రీస్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గద్దం వంశీకృష్ణ తన స్వీయ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. వేడుకతో గీతం ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి, ప్రమాణ-2024 అధ్యాపక సలహాదారు ప్రొఫెసర్ పీ.త్రినాథరావు, స్టూడెంట్ లెఫ్ట్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ

నర్సాపూర్ రూరల్: రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో నర్సాపూర్ మండలం నాగులపల్లి (బంజారానగర్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి విద్యార్థిని టీ. కల్పనకు రెండవ స్థానం దక్కింది. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో జరిగిన ప్రదర్శనలో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల హెచ్ఎం కరుణ, గైడ్ ఉపాధ్యాయుడు ప్రసన్న కుమార్ గురువారం తెలిపారు. గైడ్ ఉపాధ్యాయుడు ప్రసన్న కుమార్ సహకారంతో కల్పన ఏర్పాటు చేసిన మల్టీ పర్పస్ సోలార్ కిసాన్ రక్షక్ అగ్రికల్చర్ సిస్టమ్ ప్రాజెక్ట్ వ్యవసాయం విభాగంలో జూనియర్ లెవెల్‌లో రెండవ స్థానం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు, అధికారులు కల్పనతోపాటు ప్రసన్నకుమార్‌ను అభినందించారు.

కల్లు సీసాతో పొడుచుకొని..

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



రక్తపుమడుగులో రవి

నర్సాపూర్ రూరల్: కల్లు సీసాతో పొడుచుకొని వ్యక్తి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం సాయంత్రం నర్సాపూర్ బస్టాండ్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం రుస్తుంపేట గ్రామానికి చెందిన సాకలి రవి తాగిన మైకంలో కల్లు సీసాతో పొడుచుకున్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు.

సింగరాయకు రారండి

పచ్చని చెట్లు.. ఎత్తయిన కొండలు.. గలగల పారే సెలయేరు.. ప్రకృతి రమణీయతకు అద్దంపట్టే ప్రాంతం సింగరాయ. ఇక్కడి గుట్టల మధ్య కొలువుదీరిన ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మీనర్సింహస్వామి జాతరకు సర్వం సిద్ధం అయ్యింది. నేటి నుంచి జాతర ప్రారంభం కానుండడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఇందుకుగాను ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

- కోహెదరూరల్(హుస్నాబాద్)

- నేటి నుంచి సింగరాయ లక్ష్మీనర్సింహస్వామి జాతర
- భారీగా తరలిరానున్న భక్తులు
- కిటకిటలాడనున్న మోయ తుమ్మెద వాగు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



జాతర ప్రాంతంలో భక్తులు (ఫైల్)

కోహెడ మండల కేంద్ర సమీపంలోని కూరెళ్ల, తంగళ్లపల్లి, గుండారెడ్డిపల్లి, బస్వాపూర్ గ్రామాల శివారులో గల గుట్టల నడి బొడ్డున వెలిసిన శ్రీలక్ష్మి నర్సింహస్వామి జాతర వైభవంగా జరుగనుంది. కోనేటిలో భక్తులు స్నానం ఆచరించి కొండపై వెలసిన స్వామిని దర్శించుకొని భక్తులు చెల్లించుకుంటారు. ఈ జాతర ప్రతీ సంవత్సరం పుష్య బహుళ అమావాస్య రోజున జరుగుతుంది. జాతరకు సిద్దిపేట జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతారు.

జాతర ప్రత్యేకత

ఇక్కడ మోయ తుమ్మెద వాగు తూర్పు నుంచి పశ్చిమ వైపునకు పారుతుంది. వర్షాకాలంలో కురిసిన వర్షపు నీరు గుట్టల పైనుంచి రకరకాల చెట్ల వేళ్లను తాకుతూ పారి వాగులో కలుస్తాయి. ఆ నీటిలో స్నానం ఆచరిస్తే సర్వరోగాలు పోతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. జాతరకు వచ్చిన భక్తులు చిక్కుడు, వంకాయ, టమాట తదితర కూరగాయాలతో వంటలు చేసుకొని అక్కడే భోజనాలు



కొండపై నర్సింహస్వామి ఆలయం

చేయడం ఇక్కడి ప్రత్యేకత. కరువు కాటకాలతో మిగితా ప్రాంతాలు తల్లడిల్లుతున్నా ఈ వాగు చుట్టు పక్కల ప్రాంతాలు మాత్రం కళకళలాడుతుంటాయి.

భక్తులు వచ్చేదారులు..

జాతరకు సిద్దిపేట నుంచి వచ్చేవారు శనిగరం గ్రామం వరకు బస్సులో రావాలి. అక్కడి నుంచి ఆటోల ద్వారా సుమారు 8 కిలో మీటర్లు ప్రయాణం చేస్తే చేరుకొచ్చు. అలాగే కరీంనగర్ నుంచి వచ్చేవారు కోహెడ వరకు బస్సులో వచ్చి కూరెళ్ల మీదుగా జాతర స్థలం వరకు ఆటోల ప్రయాణించొచ్చు. వరంగల్, హుస్నాబాద్ నుంచి వచ్చే భక్తులు బస్వాపూర్ గ్రామం వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి కాలి నడకన సుమారు 3 కిలో



మీటర్లు నడిచి జాతరకు చేరుకోవచ్చు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీ వాసాల సతీష్, సీఐ ఎర్రల కిరణ్, ఎస్ఐ తిరుపతి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

తొమ్మిదేళ్లుగా వివాదం

శ్రీలక్ష్మి నర్సింస్వామి జాతర జరిగే స్థలం గర్భగుడి మా ఊరి సరిహద్దులో ఉంది అంటే మా ఊరి సరిహద్దులో ఉందని కూరెళ్ల, తంగళ్లపల్లి గ్రామాల మధ్య వివాదం తొమ్మిదేళ్లుగా నడుస్తోంది. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పంచనామాలు, సర్వేలు చేసి పరిష్కరించేందుకు ప్రత్నించినప్పటికీ జాప్యంగానే మిగిలింది. దీంతో ఈ ఏడాది అధికారికంగానే సింగరాయ జాతరను నిర్వహిస్తున్నారు.

రేపే నవోదయ పరీక్ష

- 9,11 తరగతుల్లో ప్రవేశం కోసం..
- గజ్వేల్, వర్గల్‌లో ఏడు పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 2,161 మంది విద్యార్థులు

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయంలో 2024-25 విద్యాసంవత్సరం 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు యంత్రాంగం గజ్వేల్, ప్రజ్ఞాపూర్, వర్గల్‌లో 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసింది. పరీక్ష నిర్వహణకు సంబంధించి సెంటర్ లెవెల్ అబ్జర్వర్లు, సెంటర్ సూపరింటెండెంట్‌లకు గురువారం వర్గల్ నవోదయలో ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరీక్ష నిర్వహణ, సన్నద్ధతకు సంబంధించిన వివరాలను నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు.

పరీక్ష కేంద్రాలు..

ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సెంట్ జోసెఫ్ బాలికల హైస్కూల్ గజ్వేల్, సెయింట్ మేరీస్ విద్యానికేతన్ ప్రజ్ఞాపూర్, తెలంగాణ మోడల్ స్కూల్ (సంగాపూర్ రోడ్ బాలికల ఎడ్యుకేషన్ హబ్)గజ్వేల్, జెడ్పీహెచ్ఎస్ బాలికల గజ్వేల్, జెడ్పీహైస్కూల్ బాయ్స్ ప్రజ్ఞాపూర్, జవహర్ నవోదయ విద్యాలయం వర్గల్ కేంద్రాల్లో పరీక్ష జరుగుతుంది.

అరగంట ముందే చేరుకోవాలి

ఉమ్మడి జిల్లా నుంచి తొమ్మిదో తరగతి పరీక్షకు 1,109, 11వ తరగతి పరీక్షకు 1,052 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో ఒక సెంటర్ సూపరింటెండెంట్, ఒక సెంటర్ లెవల్ అబ్జర్వర్ ఉంటారు. 24 మంది విద్యార్థులకు ఒక గది, ఒక ఇన్విజిలేటర్ ఉంటారు. 11వ తరగతికి శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, 9వ తరగతికి ఉదయం 11.15 గంటల నుంచి 1.30 వరకు జరుగుతుంది. పరీక్ష నిర్వహణకు అర గంట ముందే విద్యార్థులు కేంద్రానికి చేరుకోవాలి. విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్ (అడ్మిట్‌కార్డు), రైటింగ్ ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ తీసుకొని రావాలి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుందని ప్రిన్సిపాల్ డీ.రాజేందర్ తెలిపారు.

144 సెక్షన్ అమలు

సిద్దిపేటకమాన్: నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష జరగనున్న కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ నిబంధన అమల్లో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రం నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడి ఉండకూడదని, సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలన్నారు.



వర్గల్ నవోదయ విద్యాలయం

ఫార్మసీ రంగానికి అత్యున్నత భవిష్యత్

డాక్టర్ ప్రమోద్ యోలె



సీడీని ఆవిష్కరిస్తున్న అతిథులు, కళాశాల ప్రిన్సిపాల్

నర్సాపూర్: ఫార్మసీ రంగానికి అత్యున్నత భవిష్యత్ ఉందని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రమోద్ యోలె అన్నారు. నర్సాపూర్‌లోని విష్ణు ఫార్మసీ కాలేజీ గురువారం ప్రారంభమైన ఔషధ్ 2024 అంతర్జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సదస్సులు దోహదపడుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫార్మసీ రంగంలో ప్రయోగాలపై దృష్టి పెట్టాలని, కాలేజీలలోని ప్రయోగశాలలను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. సదస్సులో టెక్సిలా యూనివర్సిటీ (అమెరికా) క్లినికల్ రీసెర్స్ డాక్టర్ ప్రసాద్ వర నూలి, క్రిస్నో ఇనిస్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్‌డ్ న్యూరోసైన్స్ (యూఎస్ఏ) ప్రతినిధి డాక్టర్ రామక్రిష్ణ మెదూరిలు మాట్లాడుతూ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో ఆరు దేశాల నుంచి 45 కాలేజీలకు చెందిన 11 వందల మంది విద్యార్థులు పాల్గొన్నారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ప్రోగ్రామ్ కన్వీనర్స్ జాహ్నవి, నామిరా జాబిన్, సంధ్య, షఫియొద్దీన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సదస్సు సీడీని ఆవిష్కరించారు.

హత్య చేసి.. ఆపై తగులబెట్టి

- వివాహేతర సంబంధమే కారణం
- హత్నూర మండలంలో ఘటన

హత్నూర(సంగారెడ్డి): మహిళను దారుణంగా హత్య చేసి అనంతరం పెట్రోల్ పోసి తగులబెట్టిన ఘటన హత్నూర మండలం మధుర గ్రామ శివారులోని దత్తాచల క్షేత్రం సమీపంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై సుభాష్ కథనం ప్రకారం.. రత్నూరు మండలం గోవిందరాజుపల్లి గ్రామానికి చెందిన వడ్డే సునీత (45)కు హత్నూర మండలం మధుర గ్రామానికి చెందిన మాదిగ దత్తయ్యతో రెండు నెలల కిందట పరిచయం ఏర్పడింది. వీరు రెండు, మూడు సార్లు మధుర శివారు దత్తాచల క్షేత్రం గుట్టల్లో కలుసుకున్నారు. కలిసిన ప్రతీ సారీ దత్తయ్య రూ.500, రూ.1,000 సునీతకు ఇచ్చేవాడు. డబ్బులు ఎక్కువ కావాలని డిమాండ్ చేయడంతో విసిగిపోయిన దత్తయ్య గత నెల 31వ తేదీన మద్యం మత్తులో సునీత తలపై బండ రాయితో కొట్టి హత్య చేశాడు. అనంతరం పెట్రోల్ పోసి తగులబెట్టాడు. సునీత కోసం కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈనెల 2వ తేదీన హత్నూర పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సునీత కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసి విచారించగా నేరం ఒప్పుకున్నాడు. వివాహేతర సంబంధంతో డబ్బు ఎక్కువ అడగడం వల్లే హత్య చేశాడని పోలీసులు పేర్కొన్నారు.



వడ్డే సునీత(ఫైల్)

జీవితంపై విరక్తి చెంది వివాహిత ఆత్మహత్య



జ్యోతి మృతదేహం

మద్దూరు(హుస్నాబాద్): ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన దూల్మిట్ట మండలం లోని హనుమతండా గ్రామ పరిధిలోని మహారాజ్ తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ షేక్‌యూనూస్ అహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భానోతు జబ్బర్ కూతురు జ్యోతి(25)ని సూర్యాపేట జిల్లా లోని తుంగతుర్తి మండలంలోని భాపన్‌భాయి తండాకు చెందిన ధారావత్ నరేశ్‌తో మూడేళ్ల కిందట వివాహం జరిపించారు. కొద్ది రోజులుగా జ్యోతికి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో తల్లిదండ్రులు తమ వద్దే ఉంచుకొని హైదరాబాద్‌లో చికిత్స చేయిస్తున్నారు. జీవితంపై విరక్తి చెందిన జ్యోతి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి జబ్బర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు తెలిపారు. మృతురాలికి కూతురు ఉంది.

అనారోగ్యంతో వృద్ధుడు

రామాయంపేట(మెదక్): ఉరివేసుకొని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఝాన్సిలింగాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రె చంద్రయ్య (68) కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన చంద్రయ్య రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కోడలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై దాడులు



ఇసుకను డంప్ చేస్తున్న లారీ

గజ్వేల్‌రూరల్: ఇసుకను అక్రమంగా డంప్ చేస్తున్న లారీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్న ఘటన గురువారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో చోటు చేసుకుంది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రజ్ఞాపూర్ శివారులోని హైదరాబాద్ మార్గంలో ఓ లారీ ఇసుకను అక్రమంగా డంప్ చేస్తుంది. పక్కా సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి పట్టుకొని గజ్వేల్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా చేసినా, పేకాట, జూదం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే 100 లేదా సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు 87126 67447, 87126 67446 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

పేకాట స్థావరంపై..

పటాన్‌చెరు టౌన్: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించిన ఘటన పటాన్‌చెరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ మారుతీనగర్‌లో పేకాట స్థావరంపై జిల్లా టాస్క్ ఫోర్స్ సిబ్బంది బుధవారం రాత్రి విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 96 వేల నగదు, నాలుగు బైక్‌లు, 12 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని పటాన్‌చెరు పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వారిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చెరువు తూములో పడి వ్యక్తి మృతి

నిద్రపోయి ప్రమాదవశాత్తు పడిపోవడంతో..



మల్లేశం మృతదేహం

సంగారెడ్డి: ప్రమాదవశాత్తు చెరువు తూములో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన వద్ద మల్లేశం (46) పని నిమిత్తం చౌటకూర్ మండలం సుల్తాన్ పూర్ గ్రామానికి వచ్చాడు. పని ముగించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా సుల్తాన్‌పూర్ గ్రామ శివారులోని పెద్దచెరువు మైసమ్మ దేవాలయం వద్ద తూము కల్వర్టుపై నిద్రకు ఉపక్రమించాడు. ఈ క్రమంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తూములో ప్రమాదవశాత్తు పడి ఊపిరాడక మృతి చెందాడు. గమనించిన స్థానికులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే చనిపోయాడు. సమాచారం తెలుసుకున్న పుల్కల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య గోవిందమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు.

కళాకారుల నిలయం

- బీహెచ్‌ఈఎల్ కమ్యూనిటీ సెంటర్
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో రాణిస్తున్న కార్మికులు
- ప్రోత్సహిస్తున్న యాజమాన్యం



బెల్ కమ్యూనిటీ సెంటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కాలనీలోని కమ్యూనిటీ సెంటర్ కళాకారులకు నిలయంగా మారింది. ఎంతోమంది కళాకారులు ఈ వేదికపై నాటక, నాటిక ప్రదర్శనలు ఇచ్చి సినీ, బుల్లితెరపై రాణిస్తున్నారు. ఇక్కడి కళాకారులను ప్రోత్సహించడంలో బీహెచ్‌ఈఎల్ యాజమాన్యం తమ వంతు కృషి చేస్తోంది. 48 ఏళ్లుగా రాష్ట్ర, జాతీయస్థాయిలో బెల్ యాజమాన్యం నాటక, నాటిక పోటీలను నిర్వహిస్తుందంటే కళాకారులకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీహెచ్‌ఈఎల్ సంస్థ కార్మికులను కళా రంగం, సంగీత సాహిత్య రంగాల్లో రాణించాలని లక్ష్యంతో బెల్ కమ్యూనిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. కమ్యూనిటీ సెంటర్ వేదికగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది. 1966 బెల్ యాజమాన్యం అంతర్భాగ నాటిక పోటీలను ప్రారంభించి కళాకారులను ప్రోత్సహించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 1975లో మాది కమ్యూనిటీ సెంటర్ సాంస్కృతిక కార్యదర్శి పీఎస్.భాను ప్రకాశ్ జాతీయస్థాయి నాటక, నాటిక పోటీలను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు 48 ఏళ్లుగా ప్రతీ ఏటా నాటిక పోటీలను నిర్వహిస్తున్నారు. చివరిగా 2018లో 48వ నాటిక పోటీలను సైతం ఘనంగా నిర్వహించింది.

వేదికపై మహానటులు..

బెల్ కమ్యూనిటీ సెంటర్‌లో జరిగే నాటిక, నాటక పోటీలను ప్రోత్సహించడంలో సీనియర్ మహానటులు ఎందరో ఉన్నారు. ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, మురళీమోహన్, నూతన ప్రసాద్, కోట శ్రీనివాసరావు, రాజేంద్రప్రసాద్, తనికెళ్ల భరణి లాంటి ఎంతో మంది నటులు ఈ వేదికపై జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కళాక్షేత్రంలో అనేక మంది కళాకారులు వారి నటన ప్రతిభను ప్రేక్షకులకు చూపించారని స్థానికులు చెబుతున్నారు.

అందరం వెళ్లి చూసేవాళ్లం



కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో నాటక పోటీలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. నాటక, నాటిక పోటీలను చూసేందుకు కార్మికులు ఎంతో ఆసక్తిని కనబరిచేవారు. కుటుంబ సమేతంగా వెళ్లి వాటిని చూసేవాళ్లం.

– పరస రామ్మోహన్ రావు, రిటైర్డ్ బెల్ కార్మికుడు



నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

తిరిగి పోటీలను ప్రారంభిస్తాం



కళాకారులను ప్రోత్సహించడంలో బెల్ యాజమాన్యం ఎంతో కృషి చేస్తోంది. కోవిడ్ కారణంగా ఆగిపోయినా తిరిగి ఈ ఏడాది ప్రారంభిస్తాం. మేము మూడు నెలల క్రితమే ఎన్నికల్లో గెలిచి వచ్చాం. బెల్ యాజమాన్యం సహకారంతో బెల్ కమ్యూనిటీ సెంటర్‌కు పూర్వ వైభవాన్ని తీసుకొని వస్తాం. కళావేదికను సైతం ముస్తాబు చేసేందుకు సిద్ధమవుతున్నాం.

– కే. శ్రీకాంత్, కమ్యూనిటీ సెంటర్ ప్రధాన కార్యదర్శి

యాజమాన్యం ప్రోత్సహించింది



నాటి నుంచి నేటి వరకు కళాకారులను ప్రోత్సహించడంలో బెల్ యాజమాన్యం ఎంతో కృషి చేసింది. ప్రారంభంలో తాము కళా వేదికను ఏర్పాటు చేసి రాష్ట్ర, జాతీయస్థాయిలో నాటక, నాటిక పోటీలకు శ్రీకారం చుట్టాం. ఈ వేదికపై నుంచి అనేక మంది బెల్ కార్మికులు సైతం సినీ, బుల్లితెరపై రాణించడం ఎంతో ఆనందంగా ఉంది.

– నాగ మోహన్ రావు, కళాకారులు, మాజీ ప్రధాన కార్యదర్శి

ఎన్నో పోటీల్లో పాల్గొన్నాం



బెల్ కాలనీ కళాకారులకు నిలయం. తాము ఉద్యోగంలో ఉన్నప్పుడు కమ్యూనిటీ సెంటర్‌లో నాటక, నాటికల్లో నటించాం. వీటిని చూసేందుకు వందలాది మంది తరలి వచ్చేవారు. ఒక పండుగ వాతావరణం మాదిరిగా నాటిక పోటీలు జరిగేవి. 1965లో నియమ నిబంధనల ప్రతిని నేనే రాసి ఇచ్చాను. సాంస్కృతిక కార్యదర్శిగా కూడా పని చేశాను.

– శ్రీనివాస రావు, రిటైర్డ్ బెల్ ఉద్యోగి